


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అనుబంధాలు

**"ఇంకో రెండు ఇడ్లీలు తేనా?"** వైదేహి వంటగదిలోంచి అడిగింది.

"వద్దు. చాలు. కాఫీ ఇవ్వు" హడావిడిగా తింటున్న అమిత్ చెప్పాడు.

అతని ఫోన్ మోగింది. జేబులోంచి ఫోన్ తీసి ఆన్సర్ చేసాడు.

"హలో! నాన్నా!...ఎవరండీ? అవునా? ఎప్పుడు?" ఆ మాటలకి వంటగదిలోంచి వైదేహి, పక్కగదిలోంచి సుమిత్ ఒకేసారి బయటకి వచ్చారు.

"ఏమైందిరా?" సుమిత్ అన్న మొహం చూసి అడిగాడు.

"కస్తూరి ఆంటీ పోయారట" అమిత్ చెప్పాడు.

వెంటనే వైదేహి మౌనంగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. "అయ్యో పాపం అంత హెల్దీగా ఉండే ఆవిడ ఎలా పోయారు?" సుమిత్ సానుభూతిగా అడిగాడు.

"పొద్దున్నే నాన్న వాకింగ్‌కి వెళ్ళడానికి రడీ అయి, 'ఇంకా పడుకున్నావా, లే వాకింగ్‌కి వెళ్దాం' అని ఆంటీని లేపారట. అప్పటికే ప్రాణం లేదట. ఓ గంటపాటు ఏడుస్తూనే వున్నారట. ఆ ఏడుపు విని పక్కింటాయన వచ్చి డాక్టర్‌కి ఫోన్ చేసాడట. ఆయన వచ్చి నిద్రలోనే పోయిందని చెప్పారట. స్వీట్ హార్ట్ ఎటాకట. పక్కింటాయనే నాన్న ఫోన్‌లోంచి నాకు ఫోన్ చేసాడు" అమిత్ వివరిస్తూనే గబగబా తయారై తమ్ముడ్ని అడిగాడు.

"నేను వెళ్తున్నా. వస్తున్నావా?"

సుమిత్ ఓ క్షణం వంటగదివైపు చూసి, అన్న వెంట బయటకి నడిచాడు.

వంటగదిలోని వైదేహికి ఆ మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి. బయట బైక్ శబ్దం వినపడగానే వెళ్ళి ముందు తలుపు వేసి వచ్చింది. తర్వాత ఓ ప్లేట్‌లో రెండు ఇడ్లీలు తెచ్చుకుని నిదానంగా తిని కాఫీ తాగింది.

పిల్లలు బహుశా సాయంత్రందాకా రాకపోవచ్చు. తన ఒక్కదానికోసమే వంట చేసుకుంది. టి.వి చూస్తూ అనుకుంది "వైదేహీ! ఆలోచించకు బీ కూల్"

ఇరవై ఏళ్ళక్రితం ఇరవై అయిదేళ్ళ వైదేహి, బేంక్‌నించి మధ్యాహ్నమే వచ్చేసిన భర్తని చూసి ఆశ్చర్యపోయింది.

"అదేంటి ఈ టైంకి వచ్చారు? ఒంట్లో బానే వుందిగా?" కంగారుగా అడిగింది. "నీతో మాట్లాడాలి. ఓ నిమిషం కూర్చో" శంకరం ముభావంగా చెప్పాడు.

ఓసారి గదిలోకి తొంగిచూసి సుమిత్ నిద్రపోతున్నాడని నిర్ధారించుకుని, గది తలుపు దగ్గరకి వేసి భర్త ఎదురుగా కూర్చుంది.

"నేను కస్తూరితో కలిసి బతకాలనుకుంటున్నాను" సూటిగా విషయం చెప్పాడు శంకరం.

ఓ క్షణం వైదేహికి ఆ మాటలు అర్థంకాలేదు. అర్థమయ్యాక కళ్ళు పెద్దవి చేసి విభ్రాంతిగా అడిగింది.

"అంటే?"

"అంటే, నువ్వు పిల్లలు ఇక్కడ ఈ ఇంట్లోనే వుండచ్చు. నేను కస్తూరి ఫ్లాట్‌కి వెళ్ళిపోతున్నాను. నీకు జాబ్ లేదు కాబట్టి నా జీతం నీకు ఇచ్చేయమంది కస్తూరి. తన జీతంతో మేమిద్దరం సర్దుకుంటాం."

"ఒద్దొద్దు" కంగారుగా చెప్పింది అహల్య.

"నేను చాలా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. కులాలు, మతాలు అని మా నాన్న నిన్ను నాకంట గట్టాడు. ఇద్దరు పిల్లలు పుట్టినా నీ మీద రవ్వంత కూడా ప్రేమ లేదు నాకు. లక్కీగా కస్తూరి ఇవేమీ మనసులో పెట్టుకోకుండా నన్ను క్షమించింది."

శంకరం అల్మైరాలోంచి తన బట్టలు తీసుకుని సూట్‌కేస్‌లో సర్దుకున్నాడు. మరో పెట్టెలో తన వస్తువులు సర్దుకున్నాడు.

నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూండిపోయింది వైదేహి. భర్తకి ఓ ప్రేయసి ఉందని మామగారు బలవంతంగా తనతో పెళ్ళి చేసారని ఆమెకి తెలుసు. కాని శంకరం ఇలా తనని వదిలేసి వెళ్తాడని ఆమె ఎప్పుడూ ఊహించలేదు.

"వెళ్తాను. జీతం రాగానే నీ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తాను" పొడిగా చెప్పాడు.

"ఒద్దు. మీ డబ్బేమీ వద్దు. ఇంట్లో ఉండనిచ్చారు కదా చాలు" చెప్పింది.

"మరి? ఎలా బతుకుతారు?" చిరాకుగా అడిగాడు.

"డిగ్రీ చదివాగా. జాబ్ వెతుక్కుంటా. పేపర్స్ పంపితే సంతకం చేస్తా" వైదేహి చెప్పింది.

"పేపర్లేంటి?"

"మరి విడాకులు తీసుకోవాలిగా?"

"విడాకులా? కస్తూరి అలా చెప్పలేదు. తనకి పెళ్ళిమీద నమ్మకంలేదు. మాది సహజీవనమే."

"నాకు కావాలి. నేను వద్దు అనుకున్న వాళ్ళు నాకు వద్దు"

శంకరం మొహం కోపంతో ఎర్రబడింది. విసురుగా బయటకి వెళ్ళి, ఆటో పిల్చుకొచ్చి సూట్‌కేసులు పెట్టి, స్కూటర్ మీద దాన్ని అనుసరించాడు. అతను వెనక్కి తిరిగి చూడలేదు. చూస్తాడని ఆమె ఆశించలేదు.

ఓ ఐదునిమిషాలు దిగులుగా కూర్చుండిపోయింది. భవిష్యత్తు అంధకారంగా తోస్తోంది అభిమానానికి పోయి డబ్బు వద్దంది. మరి రేపటినించి ఇద్దరు పిల్లల్ని ఎలా పెంచగలదు? చదువులు?

శంకరం జీతం వద్దన్నందుకు ఆమెకి పశ్చాత్తాపం కలగలేదు. ఈ ఇల్లుకూడా మామగారికి పెద్దలద్వారా సంక్రమించిన పాత ఇల్లు. అందుకే ఒప్పుకుంది.

లేచి చీరమార్చుకుని నిద్రపోతున్న మూడేళ్ళ సుమిత్‌ని భుజాన వేసుకుని ఇంటికి తాళం వేసి బయటకి నడిచింది. ఓ చిన్న ఇంట్లో నడుపుతున్న స్కూల్‌కి వెళ్ళింది. అది చాలా చిన్న స్కూల్. ఐదో తరగతిదాకానే ఉంది. ఇంగ్లీష్ మీడియం స్కూల్ అని బయట బోర్డులో ఉన్న హెడ్‌మిస్ట్రెస్‌కే సరిగ్గా ఇంగ్లీషు రాదు. 'జాబ్ కావాలి' అని అడగ్గానే ఆవిడ ఒప్పేసుకుంది.

"ఇవాళే మా మేథ్స్ టీచర్ వెళ్ళిపోయింది. నువు ఫిఫ్త్ క్లాస్ వాళ్ళకి మేథ్స్ చెప్పగలవా?" ఏకవచనంలో అడిగింది.

"చెప్తాను"

"ఒక క్లాస్ అనికాదు. అన్ని క్లాసులవాళ్ళకి పాఠాలు చెప్పాలి. ఎనిమిదినించి మధ్యాహ్నం మూడున్నరదాకా స్కూల్లోనే ఉండాలి. జీతం ఐదువందలు" చెప్పింది.

"ఐదువందలు! ఇద్దరు పిల్లలతో ఐదువందలు ఎలా సరిపోతాయి? కానీ ప్రస్తుతానికి వెంటనే దొరికిన ఉద్యోగం టైమింగ్స్ బాగున్నాయి. అమిత్ స్కూల్ నించి వచ్చేటైంకి ఇంట్లో వుంటుంది.

ఆ ఉద్యోగానికి అంగీకారం చెప్పి ఇంటికి వచ్చింది వైదేహి. తను ఈ ఉద్యోగం ఎక్కువ రోజులు చేయలేదు. మరో మార్గం చూసుకోవాలి. పుట్టింటి అండలేదు. అత్తింటివారూ లేరు. ఎవరికీ ఈ సమస్యని చెప్పలేదు. తన భారం తనే మోయాలి అనుకుంది.

ఆ సాయంత్రం ఆరుగంటలకి పిల్లల్ని ఇంట్లో జాగ్రత్తగా ఉండమని చెప్పి తమ ఇంటి దగ్గర్లో వున్న పది పన్నెండు ఇళ్ళకి వెళ్ళింది. ఆ ఇళ్ళల్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసేవారే. వారిలో ఒకరు ఇంటికి వచ్చేదాకా పిల్లలు బయట గుమ్మంలో కూర్చోవడం, రోడ్లమీద ఆడుకోవడం గమనించేది వైదేహి. ఆ తల్లితండ్రులని కలిసి, 'వారు వచ్చేదాకా పిల్లల్ని తను చూసుకుంటానని, నెలకి తలకి రెండు వందలు తీసుకుంటానని చెప్పింది. ఐదుగురు వెంటనే ఒప్పుకున్నారు. కొందరు మర్నాడు చెప్తామన్నారు.

ఇంతికి వచ్చి పిల్లలకి అన్నాలు పెట్టాక అమిత్ అడిగాడు.

"నాన్నేడమ్మా? ఇంకా రాలేదా?"

"నాన్న వేరే ఊరు వెళ్ళారు. కొన్ని రోజుల దాకా రారు. వచ్చేదాకా నువ్వూ, తమ్ముడు నా పక్కన పడుకోండి" చెప్పింది.

వాళ్ళు ఆటల్లో పడిపోయారు.

ఓ రోజు స్కూల్ నించి వచ్చిన అమిత్ చెప్పాడు.

"నాన్న ఊరినించి వచ్చేసారమ్మా. నా స్కూల్‌కి వచ్చి ఇయర్ మొత్తానికి ఫీజ్ కట్టేసారు."

తర్వాత సుమిత్‌ని కూడా అదే స్కూల్లో చేర్చినప్పుడు ఆ ఫీజులు శంకరమే కట్టాడు. వైదేహి అభ్యంతరం పెట్టలేదు.

వైదేహి ఐదేళ్ళపాటు జీవితంతో సమరం చేసింది. ఐదువందలకి స్కూల్లో పనిచేసింది. పదిమంది పిల్లల సంరక్షణ చూసి తన పిల్లలతో పాటుగా వారినీ చదివించింది. తనూ చదివి గ్రూప్స్ రాసింది. స్టేట్ గవర్నమెంట్‌లో ఎల్.డి.సిగా చేరేదాకా నిరంతరం శ్రమించింది.

కస్తూరికి పిల్లలు పుట్టలేదు. శంకరం పిల్లల్ని శనాదివారాలు తన ఇంటికి తీసుకెళ్ళేవాడు. వాళ్ళకి కావలసినవి కొనిచ్చేవాడు. ప్రతీదానికి పొదుపు అంటూ మాట్లాడే వైదేహి అంటే వాళ్ళకి చులకన. ఏం కావాలన్నా నాన్నతో చెప్పి కొనిపించుకోవటం అలవాటైంది.

"నాన్న తన శాలరీ నీకే ఇస్తానంటే వద్దన్నావట ఎందుకు?" ఇంటర్మీడియెట్ చదివే అమిత్ ఓ రోజు అడిగాడు.

"నాన్న చెప్పారుగా. మీ అమ్మ సినిమా హీరోయిన్‌లా అభిమానం, సింగినాదం అంటూ మాట్లాడిందని" టెన్త్ చదివే సుమిత్ వెటకారంగా చెప్పాడు.

తన పెంపకం కంటే శంకరం డబ్బు బాగా ప్రభావం చూపిస్తోందని వైదేహికి అర్థమైంది.

ఇప్పుడు పిల్లలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లితో కంటే తండ్రితోనే చనువుగా ఉంటారు. వైదేహి వాళ్ళతో సాధ్యమైనంత తక్కువగా మాట్లాడుతుంది.

వైదేహి ఆరోజు ఆఫీస్‌కి సెలవు పెట్టేసింది. తను ఎప్పుడూ చూడని కస్తూరి మీద ఆమెకి రాగమూ లేదు. ద్వేషమూ లేదు. 'పాపం' అనుకుంది అంతే.

రాత్రి పదింటికి సుమిత్ ఒక్కడే వచ్చాడు.

"అన్నయ్య నాన్నకి తోడుగా వున్నాడు" చెప్పాడు.

ఆ మాటకి నవ్వొచ్చింది వైదేహికి. తను ఇరవై ఏళ్ళుగా వంటరిగా ఉంది.

కస్తూరిపోయిన పదకొండోరోజు రాత్రి అమిత్ తల్లితో చెప్పాడు.

"రేపు నాన్న మనింటికి వచ్చేస్తున్నారు. ఆయన అక్కడ వంటరిగా ఉండలేరు."

"ఆయన ఒప్పుకున్నారా?"

"ఒప్పుకుంటేనే కదా నీతో చెప్తున్నాం" సుమిత్ విసురుగా చెప్పాడు.

"భార్య శవం దగ్గర గంటసేపు ఏడ్చిన మనిషి పదిరోజుల్లో మొదటి భార్య దగ్గరకి రావడానికి ఒప్పుకున్నాడన్నమాట."

"ఆ వెటకారాలే వద్దు. నాన్న మనతో వుంటే ఎంత బాగుంటుంది? నువ్వే పంతానికిపోయి విడాకులు తీసుకున్నావ్" అమిత్ అసహనంగా చెప్పాడు.

"నీ మూలంగా అన్నయ్య ఎంత లాసయ్యాడో తెలుసా?" సుమిత్ అరిచాడు.

"నేనేం చేసాను?" వైదేహి తెల్లబోయింది.

"పాపం అన్నయ్య డిగ్రీలో ఒకమ్మాయిని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించాడు. ఆ అమ్మాయేమో 'మీ అమ్మానాన్న డివోర్సీలు. మీ నాన్న మీతో ఉండకుండా వేరే ఆంటీతో ఉంటాడు. ఇలాంటి ఫేమిలీ అబ్బాయిని చేసుకోడానికి మావాళ్ళు ఒప్పుకోరు సారీ!' అని చెప్పింది. పాపం అన్నయ్యెంత ఏడ్చాడో తెలుసా? నీ మూలంగానే. నువ్వు విడాకులు తీసుకోకపోతే నాన్న అప్పుడప్పుడూ మనింటికి వచ్చేవాడినని చెప్పారు" సుమిత్ ఆవేశంగా చెప్పాడు.

"అంటే నా యిష్టాయిష్టాలు, నా ప్రమేయం ఏమీ లేవన్నమాట? పాతికేళ్ళ వయసులో ఇద్దరు పిల్లలతో నేనెంత కష్టపడ్డానో మీకు తెలుసా? అప్పుడు ప్రేమ అంటూ వదిలేసి వెళ్ళిన మనిషి ఆవిడ పోగానే మళ్ళీ వస్తానంటే నేనెలా ఒప్పుకుంటాను?" వైదేహి అరిచింది.

"ఏం ఒప్పుకుంటే? ఆవిడ ఎటూలేదు. నువ్వు, నేను, అన్నయ్య నాన్నతో కలిసివుంటే మాకు సంబంధాలొస్తాయి. లేకపోతే రావు. మాకోసం ఆలోచిస్తే నువ్వు ఒప్పుకుంటావు" సుమిత్ చెప్పాడు.

వైదేహి తను పెంచిన పిల్లలవంక విస్మయంగా చూసింది. వాళ్ళు శంకరం వారసులు తప్ప వైదేహి పిల్లలు కాదు.

"ఆల్ రైట్. ఈసారి నేను వెళ్ళిపోతున్నాను. మీ నాన్నతో ఇద్దరూ ఆనందంగా ఉండండి. మీ పెళ్ళిళ్ళకి కూడా ఇబ్బందిలేకుండా మీ కస్తూరి అమ్మ చచ్చిపోయిందని చెప్పండి. రేపు ఉదయం మీరు మీ నాన్నని తెచ్చేలోగా నేను నాదారి చూసుకుంటాను" చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"నువ్వేం మాట్లాడుతున్నావో అర్థమౌతోందా? నీ జీవితం నాశనమైందని ఏడుపేకాని మా గురించి పట్టించుకోవా?" సుమిత్ అరిచాడు.

"పట్టించుకున్నానో లేదో రేపటినించి మీకు తెలుస్తుంది. ఏమైనా శంకరం అదృష్టవంతుడు" వైదేహి చేదుగా నవ్వింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments